

జోనల్ స్థాయి పోటీలకు మండల వాసి ఎంపిక

నేరడిగొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి పోటీలకు మండల వాసీ ఎంపికయ్యాడు. నేరడిగొండ మండలం కుంటాల గ్రామానికి చెందిన ఆడే రాహుల్ యూనివర్సిటీ ఆఫ్ స్పోర్ట్స్ బోర్డు, కాకతీయ యూనివర్సిటీ వరంగల్‌లో ఈ నెల 18 నుంచి 24 వరకు కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కేరలలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ (ఎం) టోర్నమెంట్‌కు జట్టుకు జిల్లా నుంచి ఆడే రాహుల్ ఎంపికకావడంతో మండల వాసులు అభినందించారు. జోనల్ స్థాయిలో రాణించి జాతీయ స్థాయిలో ఎంపికై మండలం పేరు నిలబెట్టాలన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో..

సేవలు అందేనా?



దంతన్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



భీంపూర్(టి)లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- జిల్లాలోని పీహెచ్‌సీల్లో సేవలు మృగ్యం
- నిధుల కొరతతో నీరసిస్తున్న కేంద్రాలు
- వెక్కిరిస్తున్న స్టాఫ్ నర్సుల కొరత
- కొత్త వైద్యుల నియామకంతో అందుబాటులోకి వైద్యసేవలు

ఉట్నూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోజుకు 24 గంటలు వైద్యసేవలు అందించడానికి ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినా అధికారుల ఆదేశాలు విస్మరిస్తూ వైద్య సిబ్బంది పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు అందని ద్రాక్ష పండుగా మారిన వైనం ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖలో నెలకొంది. వైద్యో నారాయణో హరీ అంటారు, వైద్యులు దైవంతో సమానమని దీని అర్థం. కాని ప్రస్తుతం నవ్వుల పాలు అవుతుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకు వైద్యసేవలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. గత కొన్నేళ్లుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డాక్టర్ లేక పోవడంతో ఇన్‌చార్జీలతో కాలం గడిపేశారు. ఇటీవల ప్రభుత్వం కొత్త డాక్టర్ల నియామకం చేపట్టడంతో కొన్ని పీహెచ్‌సీలకు వైద్యులు వచ్చారు. ఇప్పుడైనా 24/7 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం అందుబాటులోకి తేవాలని గిరిజనులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న దంతనపల్లి, నార్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, భీమ్‌పూర్(టి), జరి, సిర్పూర్(యు), జైనూర్, కెరమెరి, తిర్యాని, వాంకిడి, కాసిపేట్, దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటల పాటు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు ఉన్నా అమలు కావడం లేదు. గాదిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుల కొరత ఉండడంతో వైద్య సేవలు అందడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

రాత్రుల్లో వైద్యసేవలు అందించాలి

• పంద్ర జైవంత్‌రావు, మాజీ ఎంపీపీ, ఉట్నూర్

ఉట్నూర్ నుంచి మంచిర్యాల వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న దంతనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రుల్లో కూడా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలి. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఉట్నూర్ ఆసుపత్రికి చేరుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా గర్భిణులు, మహిళలకు కూడా రాత్రి వేళల్లో అవసరమైన వైద్యం అందుబాటులో ఉంచాలి.

కాగితాలకే పరిమితమైన 30 పడకల ఆసుపత్రులు

ప్రభుత్వం గిరిజన ప్రాంతాల ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందిస్తామని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పీహెచ్‌సీ స్థాయి నుంచి సీహెచ్‌సీ స్థాయికి పెంచింది. పీహెచ్‌సీలుగా ఉన్న నార్నూర్, జైనూరు, వాంకిడిలను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా ప్రకటించింది. అదేవిధంగా ఉట్నూర్ మండల కేంద్రంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ప్రకటించింది. సీహెచ్‌సీలు, జిల్లా కేంద్ర ఆసుపత్రులుగా ప్రకటించినప్పటికీ కావాల్సిన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైనది. ప్రభుత్వ ఉత్తర్వులు అమలుకాక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలి పోవడంతో ఆరోగ్యసేవలు అంతంత మాత్రమే అవుతున్నాయి.

కొత్త డాక్టర్లతో సేవలు అందేనా?

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పని చేస్తుండగా 69 డాక్టర్ పోస్టులు మంజూరు అయ్యాయి. కేవలం 26 మంది డాక్టర్లు మాత్రమే పని చేస్తుండగా ఇటీవల కొత్తగా ఆరుగురు డాక్టర్లను ఆదిలాబాద్ జిల్లాలో నియమించారు. ఇప్పటికైనా వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని గిరిజనులు భావిస్తున్నారు. డాక్టర్లతో పాటు ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సుల అవసరం కూడా అంతే ఉంది. 52 స్టాఫ్ నర్సుల పోస్టులు మంజూరు కాగా కేవలం 26 మంది మాత్రమే పని చేస్తున్నారు. ప్రతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందాలంటే స్టాఫ్‌నర్సుల అవసరం ఎంతో ఉంది. హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి డాక్టర్ శికారి సాయికిరణ్, అంకోలికి డాక్టర్ కల్లా ఆశాకిరణ్, ఇంద్రవెల్లికి డాక్టర్ పూజిత, దంతంపల్లికి డాక్టర్ భక్తు విజయలక్ష్మి, ఇచ్చోడకు డాక్టర్ మధురిమ, సొంపూర్ పీహెచ్‌సీకి డాక్టర్ షేక్ రాహ అహ్మద్‌లను నియమించడంతో ఇటీవల బాధ్యతలు స్వీకరించారు.

24 గంటలు వైద్య సేవలు అందిస్తాం

• డాక్టర్ మనోహర్, ఏడీఎంహెచ్‌వో, ఉట్నూర్

24 గంటల పీహెచ్‌సీలలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. మహిళలకు, గర్భిణులకు పీహెచ్‌సీలలో వైద్యం అందించి మెరుగైన వైద్యం కోసం సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ఇటీవల కొంత మంది డాక్టర్లను నియమించడంతో వైద్యుల సమస్య తీరింది.

అందని ఆసుపత్రి అభివృద్ధి నిధులు

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రతీయేటా ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధి నిధులు కేటాయిస్తోంది. గత రెండేళ్లుగా ఆసుపత్రి అభివృద్ధి నిధులు రాక పోవడంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు పరిష్కారంకాక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా పీహెచ్‌సీలలో ఏర్పడే చిన్నచిన్న మరమ్మతులు, ప్రత్యేక మందుల అవసరాలు తదితర వాటిని తీర్చడానికి ప్రభుత్వం ఏడాదికి రూ.1.75 లక్షలు కేటాయిస్తోంది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆసుపత్రి అవసరాల కోసం ఈ నిధులను ఖర్చు చేసుకుంటారు. కానీ గత రెండేళ్లుగా నిధులు రాక పోవడంతో మరమ్మతులతో ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది పేర్కొంటున్నారు.

ములుగుతో పాటు బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తా

• మంత్రి సీతక్క

బోథ్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గమైన వరంగల్ జిల్లాలోని ములుగు అభివృద్ధితోపాటు ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి అన్నివిధాలా సహకరిస్తారని మంత్రి సీతక్క హామీ ఇవ్వడం జరిగిందని బోత్ పట్టణ గ్రామ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు. శనివారం బోథ్ మండల కేంద్రానికి వచ్చిన మంత్రికి మండల కేంద్రం సమస్యలను వివరించారు. అయితే సమస్యలన్నీ తమ పార్టీ నాయకులు తీసుకురావడం జరిగిందని, తాను సహితం గతంలో బోథ్ సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని తాను ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తానని పేర్కొనడం జరిగిందని వీడిసి వారు తెలిపారు. ములుగు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయినట్లు పత్రికలలో వచ్చిన మాట వాస్తవమేనని పూర్తి కార్యరూపం దాల్చలేదని అయితే బోథ్‌ను సైతం రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దశల వారీగా బోథ్ సమస్యలు తీర్చడం జరుగుతుందని తాను సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామాభివృద్ధి కమిటీ వారు హర్షం వ్యక్తపరిచారు. భవిష్యత్తులో తాము హామీలు నెరవేర్చే అంతవరకు మంత్రి దృష్టికి తీసుకు వెళతూనే ఉంటామని వివరించారు.

ప్రశాంతంగా ముగిసిన మంత్రి పర్యటన

• ఊపిరి పీల్చుకున్న పోలీసులు

బోథ్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంత్రి సీతక్క పర్యటన శనివారం ప్రశాంతంగా ముగిసింది. స్థానికంగా బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వం బలంగా ఉండడంతో పాటు రైతు రుణమాఫీ విషయంలో రైతులు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆందోళన చేసే అవకాశం ఉందని ఇంటలీజెన్స్ వర్గాలు గుర్తించి పోలీసు అధికారులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

• ఎమ్మెల్యే జోక్యంతో..

బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ ఆదిలాబాద్ డీఎస్పీతో మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎవరు కూడా మంత్రి కార్యక్రమానికి అడ్డుతగలరని ఈ విషయమై తాను భరోసా ఇస్తున్నట్లు పోలీసు అధికారులకు వివరించారు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిని సొంత పూచికత్తుపైన విడుదల చేశారు.

• మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే.

తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు మంత్రి పర్యటనకు ఎక్కడ కూడా అడ్డురారని ఎమ్మెల్యే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. నేరడి గొండ మండలంలోని లకంపూర్ ఆశ్రమ పాఠశాల వద్ద బిఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే ఫోటో ఫ్లెక్సీలు ఆందోళన చేపట్టారు. అయితే మంత్రి సీతక్క పాల్గొన్న కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే అనుచరులు ఆందోళనకు దిగారు. అదే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే స్టేజిపై నుంచి దిగి ఎలాంటి ఆందోళన చేయొద్దని కార్యకర్తలకు, నాయకులకు తెలపడం జరిగింది. దీంతో కార్యకర్తలు ఆందోళన చేయకుండా ఉండిపోయారు. దీంతో పోలీసు అధికారులకు ఎమ్మెల్యే ఇచ్చిన మాట ప్రకారం మంత్రి కార్యక్రమం సాఫీగా జరిగిపోయింది.

• ఊపిరి పీల్చుకున్న పోలీసులు

మంత్రి పర్యటన సందర్భంగా అల్లర్లు జరగవచ్చు అన్న సమాచారంతో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు చేపట్టారు. డీఎస్పీ పర్యవేక్షణలో నలుగురు మంది సీఐలు, 8 మంది ఎస్సైలు, 85 మంది ఏఎస్సైలు పోలీస్ కానిస్టేబుల్ పాల్గొనడం జరిగింది. అయితే మంత్రి మండల కేంద్రం నుంచి వెళ్లిపోయేంత వరకు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెకముకి సైన్స్ సంబరాలు అట్టహాసంగా అట్టహాసంగా కొనసాగుతున్నాయి. ఈ పోటీలకు 33 జిల్లాల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరు కాగా ఆదివారం స్థానిక రిమ్స్ మెడికల్ కళాశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా సైన్స్ ప్రయోగశాలలోని పరికరాల గురించి ప్రొఫెసర్లు వారికి అవగాహన కల్పించారు.



పరికరాలను వివరిస్తున్న ప్రొఫెసర్లు

వైభవంగా సాయిబాబా ఆలయ బ్రహ్మోత్సవాలు

• హాజరైన మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూ రావు





సాయిబాబా విగ్రహానికి పూజలు చేస్తున్న ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు అశోక్ దంపతులు, మాజీ మంత్రి జోగు రామన్న

తలమడుగు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తల మడుగు మండలం సాయి లింగీ గ్రామంలో నిర్వహించిన సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయంలో వేద పండితులతో యజ్ఞ కార్యక్రమం నిర్వహించి ఆదివారం పూర్ణాహుతి నిర్వహించారు. అదేవిధంగా సాయిబాబా ఉత్సవ విగ్రహంతో. భాజా భజంత్రీలతో పల్లకి సేవ నిర్వహించారు. పూర్ణాహుతి సందర్భంగా ఏర్పాటుచేసిన పూర్ణకుంభాలతో బాబా విగ్రహానికి. పంచామృతంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు దెబ్బడ అశోక్ మాట్లాడుతూ గ్రామంలో. గత 24 సంవత్సరాల క్రితం ఆలయాన్ని నిర్మించి అప్పటినుంచి ఇప్పటి వరకు ప్రతీ సంవత్సరం దత్త జయంతి పూర్ణిమ సందర్భంగా బ్రహ్మోత్స వాలను నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గ్రామస్తుల సహకారంతో గుడి బడి తడి ఒడి కార్యక్రమంతో గ్రామం అభివృద్ధి వైపు సాయిబాబా దయతో ముందుకు వెళతుందన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సాయి వృద్ధాశ్రమం ఎందరికో అనాధలకు ఆసరాగా. నిలిచిందన్నారు బ్రహ్మోత్సవం సందర్భంగా మాజీ మంత్రి పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపు రావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ప్రహల్లాద్, మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేష్, తోట ప్రమోద్, ముడుపు కేదారేశ్వర రెడ్డి, రమాకాంత్, మాజీ సర్పంచ్ పోచన్న, పిడుగు అభిరామి రెడ్డి, తోట చందు, శివ, పోచ్చన్న, వేద పండితులు వేణు గోపాల స్వామి, శ్రీనివాస్ స్వామి. నేరెళ్ల కళ్యాణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోరా..?!

• మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో పులి వరుస దాడుల్లో ప్రజలు, అమాయక ఆదివాసులు చనిపోతున్నారని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా జోగు రామన్న అన్నారు. బజార్‌హత్నూర్ మండలంలోని డెడ్రా గ్రామానికి చెందిన భీమాబాయి చిరుత దాడిలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. ఆదివారం ఆమెను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి ఆదిలాబాద్ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్ చికిత్స పొందుతున్నారని తెలుసుకుని ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పులుల సంచారం పెరిగిన ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. 15 రోజుల క్రితం కాగజ్‌నగర్ డివిజన్‌లో మహిళపై దాడి చేసి పులి దాడి చేసి పులి హతమార్చిందని, సిర్పూర్ రైతు పై దాడి చేసిందన్నారు. ఈ ఘటనలు మరవకముందే బజార్‌హత్నూర్ మండలంలోని డెడ్రాలో చిరుత దాడి చేసిందన్నారు. ప్రభుత్వం పరంగా నష్టపరిహారం సక్రమంగా అందించడం లేదని ఆరోపించారు. జనాలు చనిపోతున్న దాడులు జరుగుతున్న అధికారులు కానీ అధికార పార్టీ నాయకులు కానీ, అటవీ శాఖ మంత్రి సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కూడా పరామర్శించలేదని మండిపడ్డారు. పులుల నుంచి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మాజీ మంత్రి వెంట రిమ్స్ సూపరిండెంట్ డాక్టర్ అశోక్, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ సాజిదొద్దిన్, నారాయణ, పరమేశ్వర్, రమేష్, జగదీష్ పాల్గొన్నారు.



బాధితురాలితో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి

ఆదిలాబాద్ రూరల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమకు ఆసక్తి కలిగిన క్రీడల్లో నైపుణ్యాలను సాధించి ఉన్నతంగా ఎదగాలని, వారికి అన్నివిధాలా అండగా నిలబడతామని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల గ్రామంలో జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అతిథులకు నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారితో కలిసి సరదాగా క్రికెట్ ఆడుతూ ఉత్సాహపరిచారు. అంతకు ముందు గ్రామంలోని దాత్తాత్రేయుడి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గంద్రత్ రమేష్, జగదీష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, కానక రమణ,మోతీరాం, జంగు బాపు, అశోక్ పాల్గొన్నారు.

రూ.40 కోట్లతో రహదారుల అభివృద్ధి

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని రహదారు లకు 40 కోట్లతో అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హామీనిచ్చారు. ఆదివారం మండలంలోని అంజి గ్రామంలో అంద్ ఆదివాసీలు నిర్వహించిన పులాజీ బాబా ధ్యాన కేంద్రం 35వ వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి హాజరైన అంద్ ఆదివాసీలతో పాటు గిరిజనేతరులనుద్దేశించి మాట్లాడుతూ అంద్ ఆదివాసీ తెగలో జన్మించిన పులాజీ బాబా చూపిన మార్గంలో ప్రతీఒక్కరు నడుచుకోవాలని సూచనలు చేశారు. పులాజీ బాబాకు తెలంగాణ రాష్ట్రంలోనే భక్తులు లేరని మహారాష్ట్ర, రాజ స్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో చాలా మంది భక్తులు ఉన్నారని గుర్తు చేశారు. తన నియోజక వర్గంలో ఉన్న పులాజీ బాబా ధ్యాన కేంద్రాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని పలు గ్రామాల రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో పాటు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో నిధుల మంజూరుకు సీఎం హామీనిచ్చారన్నారు. త్వరలో నిధులకు మంజూరు చేస్తుందని, మంజూరు కాగానే టెండర్లు పిలిచి రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సహకార బ్యాంకు (ఏడీసీసీ) ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రైతులు వ్యవసాయ అభివృద్ధి కోసం రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారని అన్నారు. రుణాలు కావాల్సిన రైతులు తమ ఏడీసీసీ బ్యాంకులకు వెళ్లాలని బ్యాంకు మేనేజర్‌లు రుణాలు ఇవ్వ కుంటే ప్రతీ సోమవారం జిల్లా కేంద్రంలోని బ్యాంకు అందుబాటులో ఉంటానన్నారు.

అమ్మ నాన్నకు తోడుగా చిన్నారుల సమ్మె

• ఆరో రోజుకు చేరిన సమ్మె



సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు, చిన్నారులు

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉద్యోగుల పిల్లలు టెంట్‌కు వచ్చి దినమంత కూర్చుని మద్దతు తెలిపారు. సీఎం సారు వెంటనే స్పందించి న్యాయం చేయాలని చిన్నారులు కోరారు. ఈ కార్యక్రమం పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి, సమగ్ర శిక్షా ఉద్యోగుల ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం సమగ్ర శిక్షా ఉద్యోగుల పట్ల మరణంలో కూడా వివక్షత చూపడం చాలా బాధాకరమన్నారు. ఎంఈఓలు సోమయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, భూమారెడ్డి, పోశెట్టి, కాంప్లెక్స్ హెచ్ఎంలు కుమ్ర రమేష్, విజయలక్ష్మి వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమం లో రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్నా, కార్యదర్శులు పార్థసారథి, కేశవ్, వెకంటి, శ్రీకాంత్, ప్రియాంక, నవీన, మమతా, భారతి, జ్యోతి, రాకేష్, సురేష్, భోజన్న, సురేందర్, పొచ్చన్న, నలీం, రమేష్, వెంకన్న, సోమన్న, చిరంజీవి పాల్గొన్నారు.

ఏజెన్సీ గిరిజన, గిరిజనేతర రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌చౌహాన్

ఉట్నూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార సభలో ఏజెన్సీ ప్రాంత గిరిజన గిరిజనేతర రైతులకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరవేర్చాలని ఏజెన్సీ రైతులకు రైతుభరోసా కల్పించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు,బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు భరత్‌చౌహాన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గిరిజన చట్టాలను పకడ్బంధీగా అమలు చేసి గిరిజన హక్కులను కాపాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1970 కంటే ముందు నుంచి కాస్తులో ఉన్న గిరిజనేతర రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. గిరిజనేతర రైతులకు పట్టాలు ఇచ్చేవిషయమై ప్రత్యేకకమిషన్ ఏర్పాటు చేయాల న్నారు. ఈ సమావేశంలో శంకరయ్య, బండి నరసయ్య,వీరయ్య, కొమురయ్య, శ్రీనివాస్, టీ బొట్టేముకుంద్‌రావు తదితర రైతులు పాల్గొన్నారు.

ముగిసిన బాజీరావ్ మహరాజ్ పుణ్యతిథి వేడుకలు

ఆదిలాబాద్‌అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాగ్యనగర్‌లో మూడు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మలీన్ శ్రీ సద్గురు బాజీరావ్ మహరాజ్ పుణ్య తిథి వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మహరాజ్ చిత్రపటానికి ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పల్లకి ముందు నృత్యాలు చేస్తూ బాబా నామస్మరణ చేశారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కర్సెంగ విలాస్ మహరాజ్ ఆధ్వర్యంలో కీర్తన భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు మోర విఠల్, బోయర్ గులాబ్, కుమ్ర నారాయణ, వినాయక్, ఉరడే వినోద్, రాజు, మేస్రం కృష్ణ, శివన్న తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఆత్రం సుగుణ

ఇంద్రవెల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీకి చెందిన వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు జెల్పట్ గోవింద్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జెల్పట్ మారుతి తల్లి జెల్పట్ పద్మినిబాయి శుక్రవారం మరణించగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకురాలు ఆత్రం సుగుణ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి తల్లి మృతి పట్ల ప్రగాఢ సాను భూతిని వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యేతో సోనాల మండల అయ్యప్ప స్వాములు

సన్నిధానం కోసం సహకరించండి

● ఎమ్మెల్యేను కోరిన అయ్యప్ప స్వాములు

బోథ్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోనాల మండలంలోని అయ్యప్ప స్వాములు ఆదివారం స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అయ్యప్ప భక్తుల సన్నిధానం కోసం సహకరించాలని ఎమ్మెల్యేకు విన్నవించగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం జరిగింది. అంతేగాక మండలంలోని మరల పెళ్లి గ్రామ మాజీ సర్పంచులు దేవేందర్ అంబాజీలు ఎమ్మెల్యేను కలిసి గ్రామ సమస్యలను విన్నవించారు. సమీప భవిష్యత్తులో సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

ఘనంగా అఖండ నామ సంకీర్తన



సుందర చైతన్యానంద చిత్రపటం వద్ద దీపాలు వెలిగించిన భక్తులు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): స్వామి సుందర చైతన్యానంద స్వామి 77వ జన్మదినం పురస్కరించుకొని ఈ నెల 12 ఉదయం 6 గంటల నుంచి 15 వరకు 77 గంటల పాటు అఖండ నామ సంకీర్తన కార్యక్రమాన్ని సత్సంగ భక్తులు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని సుందర సత్సంగ్ భక్తులు స్థానిక వినాయక్‌చౌక్‌లోని పోలావార్ కంప్లెక్స్‌లోని శ్రీ మురళికృష్ణ ఆలయంలో నిర్వహించారు.ఆదివారం ఉదయం 11గంటలకు అఖండ నామ సంకీర్తన సమాప్తి కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక హారతి, ప్రసాద వితరణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో సుందర సత్సంగ్ అధ్యక్షులు నర్సింగ్‌రెడ్డి, కృష్ణానంద, కొమ్రెవాభాశెట్టి, శివుడయ్య, జయదేవ్, శివారెడ్డి, చిలుక దశరథ్, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,సుందర సత్సంగ్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

● రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్న ఆశాకార్యకర్తలకు ప్రభుత్వం రూ.18వేల వేతనం ప్రకటించాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల రాష్ట్ర బస్ జాతలో భాగంగా ఆదివారం బృందం సభ్యులు జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆశావర్కర్ల సమస్య త్వరగా పరిష్కారం కావాలంటే ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందని అందుకే ఈ బస్‌జాతను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పెద్దలు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఫిక్స్ వేతనం చెల్లిస్తామని హామీనిచ్చారని, మ్యానిఫెస్టోలోను పెట్టారని పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఆశా, అంగన్ వాడీలను మోసం చేయడంతోనే ఓడి పోయిందని ఈ ప్రభుత్వం సైతం అలాగే వ్యవహరిస్తే పుట్టగతులులేకుండా పోతుందని మండిపడ్డారు. వెంటనే హర్యాన, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మాదిరిగానే ఆశావర్కర్లకు రూ.18వేల ఫిక్స్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నీలాదేవి, కోశాధికారి గంగామణి, బృంద సభ్యులు సునిత, సాధన, బాలమణి, సంఘం జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ, ఎం.సుజాత, బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, సునిత, వెంకటమ్మ, ఆశ యూనియన్ నాయకులు లక్ష్మి, సంగీత, పుష్ప పాల్గొన్నారు.

ఏబీవీపీ ఇందూర్ విభాగ్ హాస్టల్ కన్వీనర్‌గా బోయిడి ఆకాష్ నియామకం



బోథ్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండల కేంద్రానికి చెందిన బోయిడి ఆకాష్‌ను అఖిలభారత విద్యార్థి పరిషత్ హిందూ జిల్లా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ హాస్టల్ కన్వీనర్‌గా నియమించారు. నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు నెరవేర్చాలి : టీయూసీఐ



మాట్లాడుతున్న రాజన్న

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం భగత్ సింగ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఎం. బక్కన్న అధ్యక్షత వహించారు. పరిశ్రమల జీవో 73 షెడ్యూల్ సవరించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని, కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు నెలకు 26 చెల్లించడంతో పాటు 2019 మోటార్ వాహనాల చట్టం రద్దు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ నెల 27న జిల్లా మహాసభలు నిర్వహిస్తామని కార్మిక వర్గం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఎస్. గంగన్న, లక్ష్మీ, లత, భీమవ్వ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

లక్ష్మణచాంద, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఆర్ఎంపీగా వైద్య సేవలందిస్తూ అకాల మరణం చెందిన సాగర్ అనే వైద్యుడి కుటుంబానికి ఆర్ఎంపీ వైద్యుల మండల సంఘం రూ. 10 వేలను విరాళంగా ఆదివారం అందజేశారు. నిర్మల్ మండలం గోపాల్‌పేట్‌కు చెందిన సాగర్ గత చాలా కాలంగా మండల కేంద్రంలో వైద్య సేవలందిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. కాగా ఆయన భార్య స్రవంతికి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుల మండల సంఘం ఉపాధ్యక్షులు నాగుల రాజు, కార్యదర్శి శంకర్, తదితరులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఆహార పొట్లాల పంపిణీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ జన్మదినం పురస్కరించుకొని ఆదివారం ఏరియా ఆసుపత్రిలో అస్లాం, అక్బాబ్ ఆధ్వర్యంలో రోగులకు ఆహార పొట్లాలు అందజేశారు. జిల్లా మైనారిటీ అధ్యక్షుడు జునైద్ మెమన్, అల్తాఫ్ అహ్మద్, ఖీజర్, ముజ్జుహార్ పాల్గొన్నారు.



బాసర గ్రామంలో దత్త జయంతిని పురస్కరించుకొని పల్లకి సేవ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం



దత్త మందిరంలో ఊయల పూజ నిర్వహిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు

బాసర, డిసెంబరు, 15 : (ఆంధ్రజ్యోతి): బాసర మండలకేంద్రంలో ఆదివారం దత్త పౌర్ణమి పురస్కరించుకొని దత్త జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గల దత్త మందిరంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీక్షలు తీసుకున్న భక్తులు విరమించారు. పల్లకి సేవ, శోభాయాత్ర గ్రామ వీధుల్లో భక్తి శ్రద్ధలతో కొనసాగింది. పూజలు ముగిశాక ఆలయం వద్ద గ్రామస్థులు అన్నదానం నిర్వహించారు.

నిర్మల్ కల్చరల్: పట్టణంలోని దత్తాత్రేయ నగర్‌లోని ఆలయంలో ఆదివారం దత్త జయంతి నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తోట సత్యనారాయణ, ఆనంద్, రాజు, అశోక్ రావు, తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు హాజరయ్యారు.

భైంసా రూరల్: మండలంలోని దేగాం గ్రామంలో ఆదివారం దత్త జయంతి ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి ఆశీస్సులతో సకాలంలో వర్షం కురిసి సమృద్ధిగా పంటలు పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కుంటాల: మండలంలోని కల్లూరు దత్త వెంకట సాయి మందిరంలో ఆదివారం దత్త జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం మహా పశుపత హోమం, పూర్ణాహుతి, దత్తాత్రేయ స్వామి జననం, డోలాహరణం, ఉపనయనం, గోపాలకాల, భిక్షాటన తీర్థ ప్రసాదం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే రామరావు పటేల్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్త జయంతి ఉత్సవాలకు భైంసా, నిర్మల్, హైదరాబాద్ మహారాష్ట్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్లూరు గ్రామం భక్తజనంతో పోటెత్తింది. కల్లూరు వాసవి కళాశాల ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు ఏర్పాటు చేశారు. సాయంత్రం దత్తాత్రేయ స్వామి పల్లకి సేవ నిర్వహించారు. ఈ పల్లకి సేవలో యువకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బాలాపూర్‌లో

జైనథ్: జైనథ్ మండలంలోని బాలాపూర్ గ్రామంలో ఆదివారం దత్త జయంతి పౌర్ణమిని పురస్కరించుకొని బాలాపూర్ దత్త ఆలయంలో దత్త జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సద్గురు దత్తమహారాజ్ అనుసూయ మాత రేణుకా మాత ఉత్సవ విగ్రహాలను డప్పుల భజాల మధ్య బాలాపూర్ గ్రామంలోని పలు వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి జోగు రామన్న, బీజేపీ యువ నాయకులు పాయలశరత్, బాలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్‌లు జక్కుల వినోద్‌యాదవ్, తుమ్మడి భగవండ్లు, నాయకులు వేణుయాదవ్, శంకర్, భక్తులు పాల్గొన్నారు.

కనుగుట్టలో

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మాహోర్ మహారాజ్ ఆధ్వర్యంలో దత్తాత్రేయ ఆలయంలో గ్రామ అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ వారు దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. ఉదయం వేద పండితులు నెమలికొండ



హారతినిస్తున్న అర్చకుడు, వేడుకల్లో పాల్గొన్న భక్తులు



సంతోష్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో గణపతి, గౌరీ పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి దత్తా త్రేయుడిని పల్లకిలో ఊరేగింపు పుర వీధుల గుండా కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామంలో దత్తాత్రేయ నామస్మరణ చేస్తూ భజన కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం స్వామి వారిని ఊయలలో వేసి నామకరణం చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



కల్లూరు సాయిబాబా ఆలయ ప్రాంగణంలో యజ్ఞం ముగింపు కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు



కల్లూరు సాయిబాబా ఆలయంలో దత్తజయంతి వేడుకల్లో ఎమ్మెల్యే రామరావు పటేల్, భక్తులు

నేడు కోలాం గిరిజనుల మహా ధర్నా

ఉట్నూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కోలాం ఆదిమ గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ముందు మహాధర్నా నిర్వహించనున్నామని, చలో ఐటీడీఏ కార్యాక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉమ్మడి జిల్లాలోని కోలాం గిరిజనులు భారీ సంఖ్య లో తరలిరావాలని కోలాం సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం భాస్కర్ పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా కోలాం గిరిజనుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్న ప్రభుత్వాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అన్నారు. మన్నేవార్లు కోలవర్‌గా కుల ధ్రువీకరణ పత్రాలు పొంది చెలామణి అవుతున్నారని 2002లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన్నేవారులను ఎస్టీ జాబితా నుంచి తొలగించడం జరిగిందన్నారు.

బీఆర్ఎస్ ఇకనైనా వాస్తవంలోకి రావాలి

ఖానాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ ఇకనైనా సొంత భజన మానుకుని వాస్తవంలోకి రావాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్‌లు అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారిరువురూ మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కపై చేసిన ఆరోపణలను వారు ఖండించారు. ఖానాపూర్‌లో మంత్రి సీతక్క ప్రారంభించిన అర్బన్ పార్క్ తమ హయాంలో నిర్మాణం జరిగితే మంత్రి శిలా ఫలకాలు వేసుకునేందుకు వచ్చారని పేర్కొనడం సరికాదని మండిపడ్డారు. పార్క్ ప్రారంభించిన తర్వాత తిరిగి శిలాఫలకాలు వేసుకొని ప్రారంభిస్తే ఇటువంటి మాటలు మాట్లాడారని కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఆరోపణలు చేయవద్దన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ తన తీరు మార్చుకోలేకపోతే వారికి బుద్ధి చెప్పి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, ఏడవ వార్డు కౌన్సిలర్ కిషోర్ నాయక్, మండల పరిషత్ మాజీ వైస్ చైర్మన్ తోట సత్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ మజీద్, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్ తదితరులున్నారు.

బాధితురాలికి పరామర్శ

ఆదిలాబాద్ రూరల్, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): బజార్‌హత్నూర్ మండలంలోని డెడ్రా గ్రామానికి చెందిన మహిళ అర్క భీమబాయిపై శనివారం చిరుత పులి దాడి చేయడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క, కిసాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి బాధితురాలికి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని సుగుణక్క తెలిపారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై జిల్లా అదనపు వైద్యాధికారి కుడిమెత మనోహర్‌ను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నలిమెల నవీన్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

ఎడ్ల బండి ఢీకొని ఒకరి దుర్మరణం



మృతిచెందిన బాలాజీ

భైంసా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భైంసా - పార్డీ (బి) రోడ్డు మార్గంలోని గుండేగాం వంతెన పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం పాలయ్యారు. మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన ఎస్.బాలాజీ పాటిల్ (48)) రాత్రి వేళలో భైంసా నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదం బారిన పడ్డాడు. గుండేగాం గ్రామ వంతెన వద్ద ద్విచక్ర వాహనంపై వెలుతున్న ఎస్. బాలాజీ పాటిల్ ఎదురుగా వస్తున్న ఎడ్ల బండిని ఢీకొట్టుకోవడంతో ఘటన జరిగినట్లుగా సమాచారం. ప్రమాదంలో ఎస్.బాలాజీ పాటిల్ తీవ్రగాయాల బారిన పడి ఘటన స్థలిలోనే దుర్మరణం చెందినట్లుగా తెలిసింది. భైంసా రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు

ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలదే

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం



మాట్లాడుతున్న. బిజెపి జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం

తలమడుగు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజల్లో తీసుకెళ్లి బాధ్యత కార్యకర్తలదేనని బిజెపి జిల్లా అధ్యక్షుడు పతంగి బ్రహ్మానందం అన్నారు. ఆదివారం మండలంలోనీ సుంకిడి గ్రామంలో భారతీయ జనతా పార్టీ శాఖ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానంద్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. రాబోయే రోజులలో జరిగే స్థానిక బూత్ అధ్యక్షులను, బూత్ కమిటీలు వేయ్యాలని అన్నారు. స్థానిక ఎన్నికలలో బూత్ అధ్యక్షులదే కీలక పాత్రఅని, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ బిజెపి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గణేష్ పటేల్, తలమడుగు మండల అధ్యక్షులు భువనగిరి స్వామి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నక్క ధనుంజయ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల దేవన్న, బీజేపీ యువమోర్చ మండల అధ్యక్షులు దాతాజీ కిరణ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షులు గోడం భుజాంగ్రవ్, పొట్టిపెల్లి శ్రీనివాస్, కోరాన్ల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదాన్నిస్తున్న నల్దుర్తి తుర్కం చెరువు

మామడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రేమికులు, పక్షుల అభిమానులకు మామడ మండలంలోని రెండు చెరువులు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించాయి. అటవీ శాఖ ఆధ్వర్యంలో నల్దుర్తి తుర్కం చెరువు, వెంగన్న చెరువుల వద్ద నేచురల్ క్యాంప్ నిర్వహించడంతో హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాల నుంచి ప్రకృతి పర్యాటకులు వచ్చారు. రెండు రోజులపాటు బస చేసేందుకు అధికారులు అడవిలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం రోజున నల్దుర్తి అటవీ ప్రాంతంలో వలస పక్షుల కిలకిల రావాలను విని పులకించారు. వాటిని కెమెరాల్లో బంధిస్తూ ఉప్పొంగిపోయారు. గతంలో కూడా హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో వన్యప్రాణుల మనుగడ కోసం తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని నేచర్ క్యాంప్ నిర్వహించారు. రెండోసారి ఈ ప్రదేశంలో హైదరాబాద్ నుంచే కాకుండా వివిధ పట్టణాల నుంచి అధిక సంఖ్యలో పక్షుల ప్రేమికులు రావడంతో ఇక్కడి ప్రాంతం పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇటువంటి ప్రదేశాలను ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయాలని నల్దుర్తి గ్రామస్థులు కోరుతున్నారు. పర్యాటకుల కోసం దిమ్మదుర్తి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌వో అన్నపూర్ణ, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ రాజు, తదితరులు అన్ని ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఉండి సఫారీ వాహనంలో పలు ప్రదేశాలను చూపించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో శ్రీనివాస రావు మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఎంతో బిజీ లైఫ్‌లో ఒక్కసారైనా ప్రకృతి ఒడిలో గడుపుతే మనసు ప్రశాంతంగా ఉంటుందని, వన్య ప్రాణుల పట్ల, అటవీ సంపద పట్ల అవగాహన కలుగుతుందని నెలకు ఒక్కసారైనా అటవీ అధికారులతో కలిసి ప్రకృతిలో పర్యటించాలని తెలిపారు.



తుర్కం చెరువులో హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రకృతి ప్రేమికులు

నల్దుర్తి తుర్కం చెరువు ఇదే





తుర్కం చెరువులో పర్యాటకులు పక్షులను కెమెరాలో బంధిస్తున్న దృశ్యం





నల్దుర్తి తుర్కం చెరువులోకి వలస వచ్చిన వివిధ రాష్ట్రాల పక్షులు

మొదటి రోజు ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్అర్బన్,ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా ఎలాంటి పొర పాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రూపు-2 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పరీక్షకు తొలి రోజు ఆయా కేంద్రాల వద్ద అభ్యర్థులను క్షుణంగా తనిఖీ చేసిన అనంతరం వారిని లోనికి అనుమతించారు. అభ్యర్థులు కూడా పరీక్ష సమయం కంటే గంట ముందే కేంద్రాలకు చేరుకున్నారు. అయితే నిమిషం ఆలస్యం నిబంధన కారణంగా పలువురు అభ్యర్థులు పరీక్ష రాయకుండా వెనుదిరగాల్సి వచ్చింది. అదే విధంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించగా డీఎస్పీ జీవన్‌రెడ్డి పర్యవేక్షించి సూచనలు చేశారు. ఇదిలా ఉంటే మావలలోని చావెర అకాడమి సీబీఎస్‌ఈ సెకండరీ హైస్కూల్, మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాల, భుక్తాపూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-2 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆకస్మికంగా తనిఖీ చేసి సీసీ కెమెరాలను, అభ్యర్థుల హాజరు శాతం, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూపు-2 పరీక్షలు రెండు రోజులు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అటు ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 10,428 మంది అభ్యర్థులకు గాను 5,905 మంది హాజరు కాగా 4,523 మంది అభ్యర్థులు గైర్హజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 10,428 మంది హాజరు కావాల్సి ఉండగా 5,864 మంది హాజరు కాగా 4,564 మంది గైర్హజరయ్యారు. కాగా పలు పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సందర్శించి బందోబస్తును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎలాంటి తప్పులు జరుగకుండా అభ్యర్థులను క్షుణంగా తనిఖీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

నిర్మల్‌లో 4,416 మంది అభ్యర్థుల హాజరు...

నిర్మల్‌కల్చరల్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్ష తొలిరోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. కలెక్టర్ అభిలాష అభినవ్ దీక్ష, వశిష్ట కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 8080 అభ్యర్థులకు గాను 4146 మంది హాజరయ్యారు. రెండోపరీక్షకు 4115 మంది హాజరు. పరీక్ష నిర్వహణ తీరును కలెక్టర్ పరిశీలించారు. కమిషన్ నిబంధనలు పాటిస్తూ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అభ్యర్థులకు సూచించారు. ఉదయం, సాయంత్రం రెండు పరీక్షలు నిర్వహించారు. కేంద్రాల పరిధిలో 163 సెక్షన్ అమలు చేస్తూ కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రీజినల్ కో-ఆర్డినేటర్ పీజీ రెడ్డి, పర్యవేక్షణ అధికారులు, తహసీల్దార్లు రాజు, సంతోష్ కలెక్టర్ వెంట ఉన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్





సమయం మించి పోవడంతో పరుగులు తీస్తున్న అభ్యర్థులు







పరీక్ష కేంద్రానికి లేటుగా వచ్చిన అభ్యర్థులు

కమ్ముకున్న పొగమంచు

కనువిందు చేస్తున్న ఆదిలాబాద్ అందాలు





చాందావాగును కమ్మేసిన పొగమంచు

రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు ఆదిలాబాద్ జిల్లాలోనే నమోదవుతున్నాయి. ఏకంగా ఆదివారం 6.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం గజ గజ వణికి పోతున్నారు. మరో పక్క జిల్లాలో అటవీ ప్రాంతాలు అధికంగా ఉండడం ఉదయం వేళలో పొగమంచు కమ్ముకోవడంతో పల్లె ప్రాంతాలు మంచు కాశ్మీరాన్ని తలపిస్తున్నాయి. చూపరులకు ముగ్ధమనో హారంగా కనిపిస్తున్నాయి.ఈ చిత్రాలే ఇవి.

(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్‌ఫోటోగ్రాఫర్)



రోడ్డును కమ్మేసిన పొగమంచు



పొగమంచులో నుంచి వెళుతున్న వాహనాలు

నేటి నుంచి ధనుర్మాస వ్రత మహోత్సవాలు

● ముస్తాబైన లక్ష్మీవేంకటేశ్వర ఆలయం



లక్ష్మీ వేంకటేశ్వర ఆలయం

భైంసా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): : పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర ఆలయం సోమవారం నుంచి జనవరి 14 వరకు జరిగే ధనుర్మాస వ్రత మహోత్సవాల కోసం సర్వంగా సుందరంగా ముస్తాబు అయింది. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం వేకువజాము నాలుగుగంటల నుంచి వేడుకలు ప్రారంభం కానున్నవి. ఇందుకు గాను దేవాలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు అధిక సంఖ్యలో తరలిరా నున్నందుకు అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆలయాన్ని శోభాయమానంగా అలం కరించారు. ఉత్సవాలను పురస్కరించుకొని మహిళాభక్తులు ఉత్సవమూర్తులను, ఆభర ణాలను, మకర తోరణాలను శుభ్ర పరిచారు. ఆలయ ప్రాంగణాన్ని శోభాయ మానంగా తీర్చిదిద్దారు. ధనుర్మాస వేడుకలలో భాగంగా ప్రతిరోజు ఉదయం వేళలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తిరుప్పావై ప్రవచనలతో పాటు ప్రత్యేకపూజ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహి స్తామని ఆలయ అర్చక బృందం తెలియచేసింది. ధనుర్మాస ఉత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థాన అచార్య పురుషులైన శ్రీమాన్ వీరవల్లి శ్రీనివాస రాఘవాచార్యుల శిష్యులైన నిర్మల్‌కు చెందిన ఇందూర్తి అచార్య కళ్యాణ్ చేతుల మీదుగా జరుగనున్నాయన్నారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా జనవరి 8న సహస్ర దీపాలంకరణ సేవ, 10న ముక్కోటి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం, 11న కూడార్తై మహోత్సవం, అధ్యయనోత్సవాలు, 12న గోదా అమ్మవారికి నీరాటోత్సవం , 13న గోదాదేవి కళ్యాణం, 14న ధనుర్మాసవ్రత సమాప్తి పూజకార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్ల అను గ్రహానికి పాత్రులు కాగాలరని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది.



ముస్తాబైన ఉత్సవ మూర్తులు

గండిరామన్న దత్త సాయిబాబా ఆలయంలో పూజలు

నిర్మల్‌అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భక్తులతో కిక్కిరిసి పోయింది గండి రామన్న దత్త సాయిబాబా ఆలయం. ఆదివారం ఉదయం దత్త జయంతి పురస్కరించుకుని పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పలకీసేవ వంటి కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా దత్త నామస్మరణతో మార్మోగింది. ఆలయ ప్రాంగణంలో కోలాటాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం మహా అన్నదాన ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీసభ్యులు అన్ని ఏర్పాట్లను చేశారు. ఇదిలా ఉండగా ఆలయంలో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, సాయి దీక్ష సేవాసమితి అధ్యక్షులు లక్కడి జగ న్మోహన్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దత్త సాయిబాబా ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు శీహరి రావు

కడెం అడవుల్లో అరుదైన పక్షి

ఖానాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సకల జీవ జాతులకు నిలయమైన కవ్వాల్ అభయారణ్యంలో అరుదైన శీతాకాలపు నేస్తాలు సందడి చేస్తున్నాయి. గతంలో వేల మైళ్ళ దూరాన్ని ప్రయాణిస్తూ వచ్చి నార్తన్ పింటైల్ అనే పక్షి సందడి చేయగా.. తాజాగా 'గోల్డెన్ ఓరియోల్' అనే అరుదైన జాతికి చెందిన పక్షి కనువిందు చేస్తోంది. కళ్ళకు కాటుక పెట్టినట్లుగా కనిపించే ఈ పక్షి కళ్ళు ఎరుపు రంగులో ఉండి పక్షి ముక్కు లిప్స్టిక్ రాసుకున్నట్లుగా కనిపిస్తూ గులాబీ రంగులో ఉంటుంది. ఈ పక్షి శరీరాకృతి నలుపు, పసుపు పచ్చని రంగులను కలబోసుకుని అందంగా కనిపిస్తుంది. మనిషి అలికిడి వింటేనే ఆమడ దూరానికి పారిపోయే ఈ గోల్డెన్ ఓరియోల్‌కు బిడియం ఎక్కువ అని నిపుణులు చెబుతారు. అత్యంత బిడియాన్ని ప్రదర్శించే ఈ అరుదైన ప్రకృతి నేస్తం సాధారణంగా ఏ కెమెరాలకు చిక్కదని చెబుతారు. కానీ వన్యప్రాణి ప్రేమికుడు ఆదిలాబాద్‌కు చెందిన వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ఈ గోల్డెన్ ఓరియోల్‌ని తన కెమెరాలో బంధించాడు. శీతాకాలంలో దట్టమైన అడవుల్లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో మాత్రమే ఈ గోల్డెన్ ఓరియోల్ దర్శనమిస్తుందని కృష్ణ చెబుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దట్టమైన అడవులుగా పేరుగాంచిన కవ్వాల్ అభయారణ్యంలో కడెం ప్రాంతంలోని అడవుల్లో తాను పర్యటించిన సందర్భంలో ఈ గోల్డెన్ ఓరియోల్ తన కెమెరాకు చిక్కిందని కృష్ణ తెలిపారు. ఎన్నో వర్ణాలను తనలో ఇనుమడింప చేసుకున్న ఈ పక్షి గురించి శోధించగా తెలంగాణ ప్రాంతంలో 'పచ్చ పిట్ట'గా ఆంధ్రా ప్రాంతంలో 'వంగపండు' అనే పేర్లతో ఈ పక్షిని పిలుస్తారని తెలిసిందన్నారు. 200ల రకాలకు పైగా పక్షుల చిత్రాలను తన కెమెరాతో బంధించానని, ఆ పక్షులన్నింటిలో ఈ గోల్డెన్ ఓరియోల్ అందమైన పక్షిగా ఆయన అభివర్ణించారు.



కడెం అడవుల్లో సందడి చేస్తున్న 'గోల్డెన్ ఓరియోల్' పక్షి

ధరణి ఆపరేటర్ల వేతన వెతలు

● తొమ్మిది నెలలుగా అందని జీతాలు
● ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు

భైంసా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) ; సకాలంలో వేతనాలు అందక తహసీల్ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ధరణి ఆపరేటర్లు ఇబ్బందుల పాలవుతున్నారు. తొమ్మిది నెలల కాలంగా వేతనాల చెల్లింపు జరుగక వారంతా అర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. రిజిస్ట్రేషన్లతో పాటు ధరణి పథకం నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న సంబంధిత అపరేటర్లు ప్రభుత్వ నిరాధారణతో అవస్థలు పడుతున్నారు. వేతనాల కోసం వెంపర్లాడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తొమ్మిది నెలలుగా వేతనాల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంతో పాటు తహసీల్ కార్యాలయాల్లో మొత్తం 21 మంది ధరణి అపరేటర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతర ప్రభుత్వ శాఖాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు అపరేటర్లకు క్రమం తప్పకుండా నెల నెల వేతనాలు అందుతుండగా తమకు మాత్రమే ఇలా ఎందుకు జాప్యం జరుగుతుందో అన్ని ధరణి ఆపరేటర్లు మదన పడుతున్నారు.

● వినతులు అందించినా...!

సీసీఎల్‌ఏ నుంచి విడుదల కావాల్సిన బడ్జెట్ 9 నెలలుగా రాకపోవడంతో ఒక్కోక్కరికి రూ. 1.7లక్షల చొప్పున చెల్లించాల్సి ఉంది. దీంతో కుటుంబ పోషణకు అవస్థలు పడుతున్నామని ఆపరేటర్లు వాపోతున్నారు. అర్థాకలితో కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంటోందని అపరేటర్లు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు చేస్తూ కుటుంబాలను నెట్టుక రావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొంటున్నారు. ఇంటి అద్దెలతో పాటు నిత్యవసర సరుకుల కొనుగోళ్లకు పడరాని పాట్లు పడాల్సి వస్తోందన్నారు. పిల్లల విద్యాభ్యాసపు ఫీజులు చెల్లించేందుకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. వేతనాల కోసం జిల్లా కార్యాలయాల్లో, సీసీఎల్‌ఏలో అధికారులకు ఎన్ని పర్యాయాలు విన్నవిస్తున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. కలెక్టరేట్, సీసీఎల్‌ఏలో వినతిపత్రాలు సైతం అందించినట్లు వివరించారు. ఇతర శాఖల్లో పనిచేస్తున్న ఆపరేటర్ల మాదిరిగానే తమకు కూడా ప్రతినెలా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



రిజిస్ట్రేషన్ పనులు నిర్వహిస్తున్నధరణి ఆపరేటర్లు



ధరణి ఆపరేటర్

నెల నెలా వేతనాలు చెల్లిస్తే మేలు..

● వంశీకృష్ణ, అధ్యక్షులు,

ధరణి ఆపరేటర్ల సంఘం, నిర్మల్ జిల్లా

దశాబ్దకాలం పైగా తహసీల్ కార్యాలయాల్లో పనిచేస్తున్న మాకు ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. వేతన బకాయిలు లేకుండా ప్రభుత్వమే నేరుగా నెలనెలా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. వేతనాలు సకాలంలో అందక పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కుటుంబ పోషణ భారంగా మారుతోంది.







ఖానాపూర్‌లో పట్టుకున్న బియ్యం లారీతో అధికారులు (ఫైల్)

పేదల బియ్యంపై.. పెద్దల కన్ను!



ఇటీవల ఖానాపూర్‌లో ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలతో వచ్చి బియ్యం కొనుగోలు చేసి ఆటోలో తరలిస్తున్న దృశ్యం

- జిల్లాలో జోరుగా రేషన్ బియ్యం దందా
- ఇంటింటా తిరిగి బియ్యం సేకరిస్తున్న మాఫియా
- కిలో బియ్యం రూ.15 వెచ్చించి కొనుగోళ్లు
- పలు చోట్ల నేరుగా రేషన్ డీలర్ల వద్ద నుంచే చేతులు మారుతున్న బియ్యం

ఖానాపూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆకలి చావులు ఉండకూడదనే లక్ష్యంతో ఏ ఒక్క నిరుపేద కూడా ఆకలితో అలమటించకూడదని గొప్ప సంకల్పంతో ప్రతీ సామాన్యుడికి కూడు, గూడు, గుడ్డ (బట్ట) అనే కనీస అవసరాలలో ఒకటైన ఆకలిని తీర్చేందుకు ఆహార భద్రత పథకంలో భాగంగా ప్రభుత్వం అనాదిగా నిర్వహిస్తున్న రేషన్ బియ్యం పంపిణీ లక్ష్యం ప్రస్తుతం పక్కదారి పడుతుందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. నిర్మల్ జిల్లాలో నిరుపేద ప్రజలకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 390 రేషన్ షాపులను ఏర్పాటు చేసి నిరుపేద ప్రజలకు నెలనెల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. కాగా నేడు మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో దొడ్డు రకం బియ్యం తినే వారి సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. దీంతో ప్రతీ చిన్న మారుమూల పల్లెలో కూడా ఈ రేషన్ బియ్యం తీసుకునే వారిలో 70 నుంచి 80 శాతం మంది వాటిని తినకుండా దళారులకు అమ్ముకుని వచ్చిన డబ్బులకు మరికొన్ని డబ్బులు కలుపుకొని సన్న రకం బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇలా రేషన్ బియ్యంపై జనం దృక్పథం మారుతుండడంతో ఆ పరిస్థితులను సొమ్ము చేసుకునే పనిలో కొంత మంది కేటుగాళ్లు సంసిద్ధులయ్యారు. అనుకున్నదే తరువాయిగా గత కొంతకాలంగా జిల్లా వ్యాప్తంగా రేషన్ బియ్యం దందాను జోరుగా సాగిస్తున్నారు. ఇందుకు గాను ప్రతీ పల్లె పల్లెన తిరిగి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి ఎక్కువ ధరకు మార్కెట్‌లో విక్రయించుకొని సొమ్ము చేసుకుని కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. నిరుపేద ప్రజలకు కూడు, గుడ్డ అనే కనీస సౌకర్యాలలో ఒకటిగా పరిగణించి అమలులోకి వచ్చిన రేషన్ బియ్యం సరఫరా పథకం లక్ష్యం ప్రస్తుతం పక్కదారి పడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రేషన్ బియ్యం అక్రమ దందా యథేచ్ఛగా సాగేందుకు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొంతమంది అధికారులు సదరు అక్రమార్కులకు అండగా నిలుస్తూ మామూళ్ల మత్తులో తల మునకలవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మారుతున్న సామాన్యుడి దృక్పథం

ప్రస్తుత సమాజంలో గతంతో పోలిస్తే ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో సైతం ఆధునిక పోకడలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ప్రతీ మనిషి తాను సంపాదించే సంపాదనలో కూడు, గూడు, గుడ్డ అనే కనీస అవసరాలపై పరిమితికి మించి ఖర్చులు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే గతంలో రేషన్ దుకాణాల ద్వారా ప్రభుత్వాలు పంపిణీ చేసే దొడ్డు రకం బియ్యాన్ని ఇష్టంగా తినే సామాన్యులు సైతం ప్రస్తుతం బియ్యం తినడంపై పునరాలోచిస్తున్నారని చెబుతున్నారు. దీంతో రేషన్ దుకాణాల్లో తీసుకునే బియ్యాన్ని ఆ లబ్ధిదారులు కనీసం 70 నుంచి 80 శాతం మంది దళారులకే విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఈ దొడ్డు రకం బియ్యాన్ని దళారులకు విక్రయించి వచ్చిన డబ్బులకు మరిన్ని డబ్బులు కలుపుకొని మెజారిటీ ప్రజలు సన్నరకం బియ్యాన్ని కొనుగోలు చేసి తింటున్నారని చెబుతున్నారు.

పేదల బియ్యంపై పెద్దల కన్ను

నిరుపేద ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఆహార భద్రత పథకంలో భాగంగా అందజేస్తున్న రేషన్ బియ్యంపై సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతూ కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టి రైస్‌మిల్లును నెలకొల్పిన వారి కన్ను పడినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన ధాన్యాన్ని తిరిగి బియ్యం రూపంలో ప్రభుత్వానికి అప్పగించాల్సిన నేపథ్యంలో ప్రస్తుతం ఎంతో మంది మిల్లర్లు ఇవ్వాల్సిన బియ్యం ఇంకా ఇవ్వలేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను త్వరగా అప్పగించాలని ప్రభుత్వం మిల్లర్లపై ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో మిల్లర్ల కన్ను తాజాగా రేషన్ బియ్యంపై పడినట్లు చెబుతున్నారు. నిరుపేదల నుంచి ఈ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి తిరిగి సీఎంఆర్ రూపంలో ఎఫ్‌సీఐకి పంపేలా రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రతీ మారుమూల గ్రామానికి దళారులను పంపి బియ్యం దందాను జోరుగా సాగిస్తున్నారని చెబుతున్నారు.

జోరుగా రేషన్ బియ్యం దందా

జిల్లా వ్యాప్తంగా గత కొద్ది నెలలుగా రేషన్ బియ్యం దందా జోరుగా నడుస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖానాపూర్, నిర్మల్, ముథోల్ మూడు నియోజకవర్గాల్లో ప్రతీ పల్లె పల్లెలో ప్రతీ నెల మూడో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిత్యం రేషన్ బియ్యాన్ని సేకరించేందుకు దళారుల బృందాలు గ్రామాల్లో పర్యటిస్తారని చెబుతున్నారు. ఈ దళారుల బృందాలు సామాన్యుల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని 12 నుంచి 15 రూపాయల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. సదరు దళారులు ఆ బియ్యాన్ని మిల్లులకు పెద్ద వ్యాపారుల వద్దకు తరలిస్తూ కిలోకు రూ.25 చొప్పున విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఇలా సామాన్యుల వద్ద నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యంపై కిలో వెంబడి పది రూపాయల లాభాన్ని గడిస్తూ ప్రతీ నెల కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో సేకరిస్తున్న రేషన్ బియ్యం నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లోని మిల్లర్లకు విక్రయించడమే కాకుండా సారంగాపూర్ మండలాన్ని కేంద్రంగా చేసుకొని మహారాష్ట్ర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు.

సన్న రకం పంపిణీతో ఈ దందాకు చెక్?

ఈ అక్రమ దందాను అడ్డుకోవాలంటే ప్రభుత్వమే దొడ్డు రకం బియ్యానికి బదులు రేషన్ దుకాణాల్లో సన్న రకం బియ్యం పంపిణీ చేస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తే ఈ బియ్యం మాఫియాకు చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు. సన్న రకం బియ్యం కొనుగోలు చేసేందుకే సామాన్యులు దొడ్డు రకం బియ్యాన్ని దళారులకు విక్రయిస్తున్నందున ప్రభుత్వమే ఒక అడుగు ముందుకు వేసి సన్న రకం బియ్యాన్ని సామాన్యులకు సరఫరా చేస్తే ఆహార భద్రత పథకం లక్ష్యం పక్కదారి పట్టకుండా సరైన లబ్ధిదారులకు ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

రేషన్ బియ్యం దందా జోరుగా నడుస్తున్న నేపథ్యంలో దానిని అడ్డుకోవలసిన సంబంధిత శాఖల అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో రేషన్ బియ్యాన్ని సేకరించేందుకు కొంతమంది దళారులు రంగంలోకి దిగి ఇంటింటా సేకరిస్తుండగా మరికొన్ని చోట్ల రేషన్ డీలర్లు ప్రధాన సూత్రధారులుగా బియ్యం చేతులు మారుతున్నట్లు చెబుతున్నారు. సదరు రేషన్ దుకాణాల్లోనే లబ్ధిదారులకు బియ్యానికి బదులు రూ. 12 నుంచి రూ.15 వరకు నగదును చెల్లిస్తూ బియ్యాన్ని వారే దళారులకు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాల్సిన పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ సంబంధిత శాఖల అధికారులు ఈ దందాపై 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయి నుంచి మొదలుకొని జిల్లా స్థాయి వరకు ఆయా ప్రభుత్వ శాఖల్లోని పెద్దలకు సదరు బియ్యం వ్యాపారులు మామూళ్లను ముట్ట చెబుతుండడంతోనే ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు'గా సాగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రేషన్ బియ్యం అక్రమ దందాపై పౌర సరఫరాల శాఖ అధికారులను వివరణ కోరేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తక పోవడంతో గమనార్హం.

రేషన్ బియ్యం అక్రమ దందాపై నిఘా ఏర్పాటు చేస్తాం

- కిషోర్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్

నిరుపేద ప్రజలకు సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రేషన్ బియ్యం తరలింపుపై పకడ్బందీ నిఘా ఏర్పాటు చేసి ఈ అక్రమ దందాకు పాల్పడుతున్న వారికి చెక్ పెడతాం. క్షేత్రస్థాయిలో మండలాల వారీగా తహసీల్దార్లు, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్లను అప్రమత్తం చేస్తాం.

కాల్వ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న కలెక్టర్



కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులతో కలెక్టర్ అభిలాష అభినవ్

దిలావర్‌పూర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహ స్వామిని ఆదివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ దర్శించుకున్నారు. కలెక్టర్ కూతురు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి వచ్చారు. స్వామివారికి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న చిన్నారిని ఆశీర్వదించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులను దేవస్థానం కార్యనిర్వాహణ అధికారి భూమయ్య శాలువాతో సత్కరించారు.

చిరుత పిల్ల సంచారం



చిరుత పిల్ల పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు

కుంటాల, డిసెంబరు, 15 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబకంటి తండా పంచాయతీ పరిధిలోని రాయపాడ్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుందని తెలిసింది. యాసంగిలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న చేనులోంచి చిరుతపులి వెళ్లినట్లు రైతులు గమనించారు. విషయాన్ని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు, డీఆర్‌వో రేష్మ, ఎఫ్‌బీవో ముస్తాక్ ఆదివారం రాయపాడ్ అటవీ శివారు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చిరుతపులి పిల్ల పాదముద్రలుగా నిర్ధారించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

భైంసా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిత డిమాండ్ చేసింది. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఐఎఫ్‌టీయూ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో భైంసా కేజీబీవీ పాఠశాల ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. దశాబ్దన్నర కాలంగా కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూ చట్టబద్ధ హక్కులు లేకుండా నిరాకరిస్తున్నాయని పేర్కొన్నారు. కనీస వేతనాల జీవోకు అనుగుణంగా వేతనాల చెల్లింపులు చేపట్టకుండా శ్రమదోపిడి విధానాలను పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. కనీస ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్‌ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సైతం నోచుకోవడం లేదన్నారు. స్కావెంజర్ , స్వీపర్, సిబ్బందికి మాస్కులు, గ్లౌజులు, రక్షణ పరికరాలు సైతం అందివ్వడం లేదన్నారు. ఫలితంగా సంబంధిత విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అనారోగ్యాల భారిన పడి ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేపడుతున్నారని పేర్కొన్నారు. నాన్ టీచింగ్ సిబ్బందికి న్యాయం చేసేందుకు గాను కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుపరచాలన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస వేతనాలు అందించి ఉద్యోగ భద్రత కల్పించి వారందరిని రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. ఇందులో కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సునీత, ప్రతినిధులు సాగర, గోదావరి, లక్ష్మీ, గంగ సాగర, మౌనిక, గోపమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలి

- బీజేపీ శ్రేణులతో ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్



నియామకపు పత్రాలను అందిస్తున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావ్

భైంసా, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన చర్యలు, పకడ్బందీ విధానాలతో స్థానిక సంస్థ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ శ్రేణులందరూ కృషి చేయాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ బూత్ కమిటీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బూత్ కమిటీల పనితీరుపైనే పార్టీ భవిష్యత్ ఆధారపడి ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టపరచే ప్రక్రియతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమం తదితర అంశాలపై విస్తృత స్థాయి ప్రచారం కల్పించే బాధ్యత బూత్ కమిటీలపైనే ఉంటుందన్నారు. పార్టీ ముథోల్ నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజక వర్గ పరిధిలోని ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బూత్ కమిటీలు పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన బూత్ కమిటీలకు ఎమ్మెల్యే రామారావ్ పాటిల్, నియోజక వర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి పాండే, గోపాల్ సర్డాలు నియామకపు పత్రాలను అందచేశారు. ఇందులో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తాళోడ్ శ్రీనివాస్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమేష్, బండారి అశోక్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, పార్టీ ప్రతినిధులు సోలంకే భీంరావ్ పాటిల్, మధుకర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పౌర్ణమి సందర్భంగా బాసరకు భక్తుల రద్దీ



తమ పిల్లలకు అక్షర శ్రీకారం జరిపిస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బాసర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతి అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పౌర్ణమి పర్వదినంపైగా సెలవు రోజు కలిసి రావడంతో పిల్లలకు అక్షర శ్రీకారం జరిపించే భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం దాక అమ్మవారి నిలయంలో భక్తుల రద్దీ కొన సాగింది. రెండు అక్షర శ్రీకార మండపాల్లో భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాస పూజలు జరిపించారు. మొదట గోదావరి నదిలో స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పిల్లల అక్షర శ్రీకార పూజలు జరిపించేందుకు శుభ ముహూర్తాలుండడంతో బాసరకు భక్తుల తాకిడి కొనసాగుతుంది. డిసెంబరు చివరి వరకు భక్తుల రద్దీ ఉంటుందని ఆలయ పండితులు తెలిపారు.

కళ్లకు గంతలు కట్టుకుని ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆదివారం కళ్లకు గంతలు కట్టు కొని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడం, తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని పటిష్టం చేయడంలో తమ పాత్ర ఉందని ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలన్నారు. గెజిటెడ్ లెక్చరర్ ఫోరం అధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. వెంకటేష్, పురుషోత్తం, లక్ష్మణ్, నర్సయ్య సంఘీభావం ప్రకటించారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలి

భైంసా: సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని తెలంగాణ గజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కార్గామ వినోద్ కుమార్ విజ్ఞప్తి చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెకు సంఘీభావంగా ఆదివారం భైంసాలో టీజీఎల్ఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు క్రమబద్ధీకరణతో పాటు పేస్కేల్, జీవిత భీమా, ఆరోగ్య కార్డులు, మహిళా ఉద్యోగులకు ఇతర ప్రభుత్వ మహిళా ఉద్యోగుల మాదిరిగా అన్ని రకాల సెలవులు వర్తింపచేయాలని సర్కార్‌కు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వై.రజనీకాంత్, తోట లక్ష్మణ్, అర్.చందుతో పాటు పలువురు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు



భైంసాలో నిరసన తెలుపుతున్న టీజీఎల్ఏ అసోసియేషన్ ప్రతినిధులు

ఘనంగా సుందర చైతన్యానంద జన్మదిన వేడుకలు



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వామి సుందర చైతన్యానంద 77 జన్మదిన వేడుకలు ఆదివారం గాంధీచౌక్ మురళీకృష్ణ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. అభిషేకం, అష్టోత్తర శత నామార్చన అనంతరం సుందర చైతన్యానంద జీవిత చరిత్ర, సత్సంగం, భజన కీర్తనలు నిర్వహించారు. పొలిశెట్టి కిషన్, గంప శ్రీనివాస్, విఠల్, డాక్టర్ రజిని పాల్గొన్నారు.

గజ్జలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం



గజ్జలమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కుంటాల స్థానిక గజ్జలమ్మ ఆలయానికి ఆదివారం భక్తజనం పోటెత్తింది. మండలం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గజ్జలమ్మకు ప్రీతిపాత్రమైన నైవేద్యాలు సమర్పించిమొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

- పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ అర్బన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రంలోని పురాతన బంగల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులతో నిర్మల్ జిల్లా ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడు కున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీహరి రావుని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి రావుతో పాటు నిర్మల్ పురపాలక సంఘం అధ్య క్షుడు గండ్రత్ ఈశ్వర్, సారంగాపూర్, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అబ్దుల్ హాది, సోమ భీమ్‌రెడ్డి, శ్రీనివాస్, నాందేడపు చిన్ను, ఎంబడి రాజేశ్వర్, నిర్మల్, సోన్ మండల పార్టీ అధ్యక్షుడు కుంట వేణుగోపాల్, మధుకర్ రెడ్డి, శామకూర రాము, గంగారెడ్డి, రవీందర్ రెడ్డి, వంశీ, చిరం జీవి, కే.శ్రీకాంత్, గులే రాజన్న, సంతోష్, కొంతం గణేష్, శ్రీ కాంత్, పెండెం శ్రీనివాస్, గంగోని బురాజ్, పూదరి అరవింద్, గడ్డింటి ప్రశాంత్ ఉన్నారు.